క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ న్యూనాగోలు ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు. 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ విద్యుత్‌నగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

నేడు ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

మహేశ్వరం: మహేశ్వరం శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల పాలక వర్గం సభ్యులకు శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ ఈఓ మురళీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ మాజీ చైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహానగరంగా తీర్చిదిద్దండి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



సీఎం రేవంత్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్‌సిటీ ఏర్పాటు పనులు వేగవంతం చేసి మహానగరంగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫోర్త్‌సిటీ ఏర్పాటునకు 330 ఫీట్ల రోడ్డుకోసం రైతుల నుంచి భూసేకరణకు ఒప్పించడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. భూసేకరణలో రైతులకు నష్టం జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈయన వెంట పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వండి

సీఐటీయూ మండల అధ్యక్షుడు బాబు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మీర్‌పేట: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎస్ఎంఆర్, ఫిక్స్‌డే–పే కార్మికులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులను మున్సిపల్‌గా కార్మికులుగా గుర్తించి ప్రతి నెలా రూ.10వేలు ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యతగా కార్మికులకు డబుల్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కనీస వేతనాల అమలుకై శని, ఆదివారం కార్యాలయం ఎదుట కార్మికులతో ధర్నా చేపట్టనున్నామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్ యాదవ్, మీర్‌పేట అధ్యక్షుడు సిహెచ్.యాదగిరి, కార్మికులు కమలమ్మ, అంజుర, సత్తెమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం రాజేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతం, పుష్పాభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



మంత్రాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఎత్తుకెళ్లిన దొంగలు



అపహరించిన జిమ్ పరికరాల విడి భాగాలు

పర్యవేక్షణ లేక.. ప్రజాధనం మునక

- మంత్రాల చెరువు ఇనుప కంచె, ఓపెన్ జిమ్ పరికరాలు చోరీ
- వాచ్‌మెన్‌ను నియమించాలని స్థానికుల డిమాండ్

మీర్‌పేట: పర్యవేక్షణ లేక ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును కోట్లాది రూపాయలు వెచ్చించి సుందీరకరించారు. పరిసర కాలనీల వాసులకు ఆహ్లాదంతో పాటు వాకింగ్, జిమ్ చేసుకునేందుకు వీలుగా చెరువు వద్ద ఓపెన్ జిమ్, చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావడం వరకు బాగానే ఉన్నప్పటికీ పర్యవేక్షణ లేకపోవడంతో దొంగలకు వరంగా మారింది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చెరువు చుటున్న ఇనుప కంచెను కట్టర్ సహాయంతో కోసి ఎత్తుకెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల పట్టపగలే దొంగలు ఇనుప కంచెను కత్తిరిస్తుండగా మున్సిపల్ సిబ్బంది పట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెప్పారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన పరికరాలు దొంగల పాలు కావడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలిసినప్పటికీ పట్టనట్లే ఉంటున్నారని, రాత్రి వేళల్లో వాచ్‌మెన్‌ను నియమించాలని పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని పరిసర కాలనీలవాసులు పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా

రాత్రి వేళల్లో చెరువు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందని, ప్రధాన ద్వారానికి తాళం వేసినప్పటికీ మధ్య మధ్యలో చాలాచోట్ల ఫెన్సింగ్ తొలగించి ఉండడంతో మందుబాబులు అర్ధరాత్రి వరకు లోపల తిష్ట వేస్తున్నారని స్థానికులు తెలిపారు. చీకటి పడితే లోపల వాకింగ్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు అంటున్నారు. చెరువు వద్ద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసులు కూడా నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక



వినోద్‌గౌడ్



సాయిబాబాచారి

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో నూతన బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి నల్లవోలు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని 457 బూత్ కమిటీ అధ్యక్షుడిగా బాలగొని వినోద్‌గౌడ్, 458 బూత్ కమిటీ అధ్యక్షుడిగా దేవోజి సాయిబాబాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడారు. తమపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాలగొని రమేశ్‌గౌడ్, ఇటమోని రాములుయాదవ్, కొంతం మధుసూదన్‌రెడ్డి, యాదగిరిగౌడ్, మహేందర్‌గౌడ్, ఎగిరిశెట్టి అనంత్, చాకలి జంగయ్య, పగడాల తరుణ్, జగదీశ్‌యాదవ్, కిరణ్, శ్రీశైలం యాదవ్, ఎగిరిశెట్టి సాయి, వంశీధర్, ప్రశాంత్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, నవీన్‌యాదవ్, శివ, చింటూ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి



సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్‌తో తీగల అనితారెడ్డి

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారని తీగల అనితారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు తీగల అనితారెడ్డి శుక్రవారం సాయంత్రం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లను కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సీఎం, పీసీసీ అధ్యక్షుడు ఆమెకు సూచించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు కేటాయించాలని సీఎంని ఆమె కోరారని తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తీగల అనితారెడ్డి పేర్కొన్నారు.

రేపు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వనస్థలిపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 5న 'సాక్షి' ఆధ్వర్యంలో, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో (నాగార్జున పాఠశాల ఎదురుగా) ఉదయం 9.30 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు మరికొందరికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు మెటీరియల్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9705347239, 9705347248 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్.. పొంచి ఉన్న ప్రమాదం!



సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీ పార్కు వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ కంచెలు లేకపోవడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కు ప్రహరీకి ఆనుకుని కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. దీనికి దగ్గర్లోనే స్కూలు ఉందని నిత్యం వందలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ దారిగుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: రాజ్యాధికారంతోనే హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగర్‌కుంటలో బీసీ సేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా ఆనందం, ఉపాధ్యక్షులుగా రమేష్‌గౌడ్, మహేందర్, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, కార్యదర్శులుగా వెంటయ్య, కృష్ణయ్య, శ్రీశైలం, రవి, రమేష్, సలహాదారుగా రాజేందర్‌గౌడ్, సభ్యులుగా ప్రసాద్, మల్లయ్య, వెంకటయ్య, ఎల్లయ్య, సత్తయ్య, అంజయ్య తదితరులు ఎనుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలన్నారు. బీసీల లెక్క తేల్చేందుకు దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని.. పంచాయతీరాజ్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా పోరాడుతున్నా బీసీల బిల్లును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మల్లేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, నాయకులు వేణు, ఆంజనేయులు, బాల్‌రాజ్‌యాదవ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని ఏఎం క్రికెట్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పీజేఆర్ 14 మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడలపై మరింత పట్టు సాధించాలన్నారు. అనంతరం ఈ టోర్నీలో విజేత జట్టు ఎంఎంఆర్, రన్నరప్ అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ మాణిక్యం జట్టుకు షీల్డ్, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రాములు, అద్వానీ, చెన్నారెడ్డి, వెంకట్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ డీఈఈ దూద్యానాయక్



జక్కుల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

తుక్కుగూడ: చెరువులు, కుంటలను కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఇరిగేషన్ డీఈఈ దూద్యా నాయక్ తెలిపారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ రెవెన్యూ పరిధిలోని జక్కుల కుంటను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కుంట ఆనకట్టను కొంత మంది రియల్టర్లు ధ్వంసం చేశారన్నారు. దీంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం తాము పరిశీలించామన్నారు. కుంట ఆనకట్ట సగభాగం మట్టి పూర్తిగా తొలగించినట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ వాణి, ఇరిగేషన్ ఏఈ గోవింద్ నాయక్, ఆయా శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నేతలు, ఉపాధ్యాయులు మహిళా విద్యకు ఆమె చేసిన కృషిని కొనియాడారు. సావిత్రిబాయిపూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళి అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. – మహేశ్వరం



కందుకూరు: మహిళా అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో సావిత్రిబాయి జయంతి వేడుక

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

యాచారం: సంక్రాంతి పండుగ తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని, అన్ని గ్రామాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచేలా సమష్టిగా పని చేయాలన్నారు. ప్రజల మధ్యన ఉండి, పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికే ప్రజాప్రతినిధులుగా పోటి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణుల ఉమ్మడి నిర్ణయంతోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, జంగీర్, సంపత్, మురళీ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆదిబట్ల చైర్మన్ నిరంజన్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపాలిటీ చైర్మన్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 9వ వార్డులో రూ.29 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, 5వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదిహేను వార్డుల్లో సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామన్నారు. భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, తాగునీరు వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, లావణ్య, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, రాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీకాంత్‌గౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, బాబు, నర్సింహ, వెంకటయ్య, అధికారులు ఏఈ శ్రావణ్‌కుమార్, మేనేజర్ రమేశ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్ల మంజూరుపై హర్షం

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించడంతో నిధులు వచ్చాయన్నారు. మున్సిపాలిటీల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన నిధులు 2019 నుంచి నిలిచిపోయాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో నిధులు విడుదల చేశారన్నారు. వీటితో మున్సిపాలిటీలో పనులు చకచక సాగుతాయన్నారు.

ప్రతిభా పరీక్షలతో ప్రగతికి మెరుగు



చేవెళ్ల: ఇంగ్లిష్ ఒలంపియాడ్ పరీక్ష పేపర్లను చూపుతున్న ఎంఈఓ పురందాస్, ఉపాధ్యాయులు

ఎంఈఓ పురందాస్

చేవెళ్ల: జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించాలంటే ఆంగ్లం నైపుణ్యాలు అవసరమని మండల విద్యాధికారి పురందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌సీఈఆర్‌టీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంగ్లిష్ ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పోటీ పరీక్షలతో ప్రతిభ మెరుగుపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఈపోటీలలో ప్రతిభ చూపిన మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ కోశాధికారి జి.వీరప్ప, మండల కోఆర్డినేటర్ శంకర్, ఉపాధ్యాయులు బి.శివకుమార్, లత, రేవతి, చాముండేశ్వరి, లక్ష్మి, నరసింహ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు అవసరం: ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్: విద్యార్థులు మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌పైనా పట్టు సాధించాలని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్, స్పీచ్ పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిపూర్ణంగా ఇంగ్లిష్ నేర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. ఈ నెల 17న జరిగే జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మణ్, కో కన్వీనర్ అనిత, ఉపాధ్యాయులు ప్రవీణ్, బందయ్య, సరిత, జలీల్, సునీత, కవిత, కమల, సమీనా, జ్యోతి, నారాయణ, మహమూద్, రాములు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి: ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ ఉపన్యాసం, భాషా పరిజ్ఞానానికి సంబంధించిన మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.